# Department of TELUGU

## ST ANN'S COLLEGE FOR WOMEN

Autonomous , Affiliated To Osmania University
NAAC Reaccredited With A+ Grade &College With
Potential For excellence by UGC


సంచిక – 1

తేది : 30-08-2020


# లేఖిని
# (LEKHINI)

## ఎవడయ్యా తెలుగువాడు?

'విశ్వంభర'ను చెక్కినవాడు. జ్ఞానపీఠాన్ని ఎక్కినవాడు. తెలుగు సినీపాటలతో తెరకెక్కినవాడు. మహాసభల్లో మంచి మాటకారి. కవిత్వంలో గొప్ప 'కలం'కారి! తెలంగాణీయుడు.. వెరసి మన తెలుగువాడు! ఆయనే సినారె.. తేనె పాటల సెలయేటి కినారే! అంతటి మహాకవి అసలు సిసలైన తెలుగువాడు ఎవడో... ఎలాంటి వాడో... ఎంత చక్కగా చెబుతున్నారో చూడండి!



శాతవాహనుల వంశాన పుట్టినవాడు
కాకతీయుల పోతుగడ్డ మెట్టినవాడు
పల్లెలోనే కాదు ఢిల్లీలో సైతమ్ము
పెద్ద గద్దెలనేలి పేరుకెక్కినవాడు
ఎవడయ్యా ఎవడువాడు
ఇంకెవడయ్య తెలుగువాడు!

మంచి మనసెదురైన మాలలిచ్చేవాడు
భాయీ భాయీ అన్న చేయి కలిపేవాడు
తిక్క రేగిందంటే డొక్క చీల్చేవాడు
చిక్కులెరుగని వాడు చిత్తాన పసివాడు
ఎవడయ్యా ఎవడువాడు
ఇంకెవడయ్యా తెలుగువాడు!

పంచె కట్టుటలో ప్రపంచాన మొనగాడు
కండువా లేనిదే గడప దాటనివాడు
పంచభక్ష్యాలు తన కంచాన వడ్డించ
గోంగూర కోసమై గుటకలేసేవాడు
ఎవడయ్యా ఎవడువాడు
ఇంకెవడయ్య తెలుగువాడు!

## ఆహ్వానం

అందరికీ తెలుగు భాషా
దినోత్సవ శుభాకాంక్షలు!
"తెలుగు జాతి మనది.. నిండు
వెలుగు జాతి మనది" అన్న
మహాకవి సినారె గారి పలుకుల్ని
మరోసారి స్మరించుకుంటూ
వేస్తున్న తొలి అడుగు ఇది.
తెలుగు భాషాభివృద్ధి కోసం
ఈ తెలుగు భాషా దినోత్సవం
రోజున సెంట్ ఆన్స్ మహిళా కళాశాల
తెలుగు విభాగం పునరంకితం అవుతోంది.
ఆ దిశలో భాగంగా ఈ 'లేఖిని'
పత్రికను ఆవిష్కరిస్తున్నది.
విద్యార్థులలో తెలుగు భాష
మీద ఆసక్తి, తెలుగు సాహిత్యంలో సృజనను
వెలికి తీయడమే దీని ప్రధాన ఉద్దేశం.
తెలుగు భాషకు, సాహిత్యానికీ
విశేష కృషి చేసిన రచయితలు,
కవుల పరిచయాలను వారి వాణిని
ఈ 'లేఖిని' ద్వారా విద్యార్థులకు
వినిపించాలన్నది మా ఆకాంక్ష.
ఇది ప్రారంభం మాత్రమే.
విజ్ఞులు, విద్యార్థుల స్పందనని బట్టి
దీని అస్తిత్వం ఆధారపడి ఉందని
మనవి చేస్తున్నాను. ఈ చిరు ప్రయత్నాన్ని
మన్నించి ఆశీర్వదిస్తారని భావిస్తున్నాను.


**డా. ఉడాలి విష్ణుప్రియ**
**తెలుగు శాఖాధ్యక్షులు**
**తెలుగు విభాగం**

**తెలుగు భోజనం!**

మల్లాదిగారి కలం చాలా గడుసుది. తెలుగు చిటారు కొమ్మన పదాల మిఠాయి పొట్లాలు పంచి పెట్టిన కలం అది. పాటలు మాత్రమేనా.. వచనంలోనూ ఆయన అచ్చ తెనుగును ఎలా అచ్చు వేస్తారో ఈ నాలుగు వాక్యాలూ చదివితే తెలుస్తుంది. ఆయన రాసిన 'కృష్ణాతీరం' నవలలో తెలుగువారి భోజన ప్రియత్వాన్ని ఎంత చక్కగా వల్లె వేస్తున్నారో చదవండి!

"పెందరాడే కాస్త పప్పూ అన్నం పెడుతూ.. చుట్టాలోచ్చారని నవకాయ పండివంటలు చేసేవ్.. వంకాయ నాలుగు పచ్చాలు చేసి పోపులో వేసి, అనపకాయ మీద ఇంత నువ్వుపప్పు చల్లి అరటి దూట ముఖాన ఇంత ఆవెట్టి, తోటకూర కాడల్లో ఇంత పిండి బెల్లం పారెయ్! కొబ్బరి, మామిడి, అల్లం.. ఈ పచ్చళ్లు చాల్లే. పెరుగులో తిరగబోత పెట్టి దాన్లో పది గారె ముక్కలు పడెయ్.. రవ్వంత శెనగపిండి కలిపి మిరపకాయలు ముంచి చమురులో వెయ్.. సరే.. క్షీరాన్నమంటావా? అదో వంటా? ములక్కాయలు మరి కాసిన్ని వేసి పులుసు ఓ పొయ్యి మీద పడెయ్! ఈ పూటకు ఇలా లఘువుగానే పోనియ్.. ఇదిగో.. నేను స్నానం చేసి వస్తున్నాగానీ ఈలోగా ఓ అర తవ్వెడు గోధుమపిండి తడిప్పెట్టు. రత్తమ్మొస్తే నాలుగు వొత్తి అలా పడేస్తుంది.. మధ్యాహ్నం పంటి కిందకు కుంటాయ్!"

-- "కృష్ణాతీరం" నవలలో మల్లాది రామకృష్ణ శాస్త్రి

16వ శతాబ్దంలో నికొలో డి కాంటి అనే ఇటాలియన్ పరిశోధకుడు
తెలుగు భాషకి 'ది ఇటాలియన్ ఆఫ్ ది ఈస్ట్' అని పేరు పెట్టాడు.
ఎందుకంటే ఇటాలియన్ భాషలాగా తెలుగు భాష కూడా అచ్చులతో ముగుస్తుంది!



**వ్యావహారిక భాషకు గొడుగు.. మన గిడుగు!**

ఆగస్టు 29.. తెలుగు భాషా దినోత్సవం! గ్రాంథిక భాషా బోధనపై తిరుగుబాటు చేసి వ్యావహారిక భాషకోసం పాటుపడ్డ గిడుగు వెంకట రామమూర్తి పంతులుగారి పుట్టిన రోజు ఇది! అప్పట్లో చరిత్ర పాఠాలు చెప్పే పంతులుగారు గ్రాంథిక భాషపై తిరుగుబాటు చేశారంటే ఆశ్చర్యం కలుగుతుంది. తెలుగునాడంతా వ్యావహారిక భాషను వ్యాప్తి చేయడంలో ఆనాడే మహోద్యమాన్ని నడిపారంటే నమ్మశక్యం కాదు. అప్పట్లో ప్రజలు వ్యవహరించే భాషకు, పుస్తకాల్లో విద్యార్థులకు బోధించే భాషకు ఎంతో వ్యత్యాసం ఉండేది. దీనిని మొట్టమొదట గుర్తించింది నాటి ఇంగ్లీషు దొర జె. యేట్స్. ఆయన ఈ విషయాన్ని గిడుగు, గురజాడల దృష్టికి తీసుకొచ్చాడు. ఆ తర్వాతే గిడుగు తెలుగు విద్యావిధానంలో జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించాడు. దాంతో మొట్టమొదటి సారిగా ఆయన వ్యావహారిక భాషకు తగిన ప్రచారాన్ని కల్పించడం కోసం 'తెలుగు' అనే మాస పత్రికను తీసుకొచ్చాడు. ఇందులో తన శాస్త్రీయ వ్యాసాలతో, ఉపన్యాస పాఠాలతో అవిశ్రాంతంగా పోరాటం సాగించాడు. ఈ ప్రభావంతో అప్పటి వరకూ గ్రాంథిక భాషలో రచనలు చేస్తున్న చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి, తల్లావఝుల శివశంకరశాస్త్రి, వీరేశలింగం పంతులు, పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి మొదలైన కవులు, పండితులు వ్యావహారిక భాషావాదం వైపు మొగ్గు చూపారు. 1924లో కాకినాడలోని ఆంధ్ర సాహిత్య పరిషత్తు అధికారికంగా వ్యావహారిక భాషా నిషేధాన్ని ఎత్తివేసింది. ఈ చర్యతో ఆంధ్రదేశమంతటా ఈ ఉద్యమం మరింత ఊపందుకుంది. ఎన్నో సాహితీ సంస్థలు, పత్రికలు, ఇంకా ఉద్దండులనదగ్గ రచయితలు వ్యావహారిక భాషకే పెద్ద పీట వేశారు. కానీ ఇంతటి మార్పు సమాజంలో కనిపిస్తున్నా, ప్రభుత్వ విద్యాశాఖ వారు, విశ్వవిద్యాలయాల వారు గ్రాంథికాన్ని వదిలిపెట్టక పోవడం గిడుగు వారిని కలత పెట్టింది. "దేశ భాష ద్వారా విద్య బోధిస్తేగానీ ప్రయోజనం లేదు. శిష్టజన వ్యావహారిక భాష లోకంలో సదా వినిపిస్తూ ఉంటుంది. అది జీవంతో కళకళలాడుతూ ఉంటుంది. గ్రాంథిక భాష గ్రంథాలలో కనపడేదే కానీ వినపడేది కాదు. అదొక బొమ్మ వంటిది. ప్రసంగాలలో గ్రాంథిక భాష ప్రయోగిస్తూ తిట్టుకొన్నా, సరసాలాడుకొన్నా అది హాస్యాస్పదంగా ఉంటుంది.." అంటాడాయన. అయితే ఆయనెప్పుడూ ప్రాచీన కావ్యాలని చిన్నచూపు చూడలేదు. చదవకూడదని చెప్పలేదు. వాటిని సామాన్య ప్రజలు కూడా అర్థం చేసుకుని ఆనందించాలంటే వ్యావహారిక భాష ఒకటే మార్గమన్నది ఆయన సిద్ధాంతం! ఆ కల నిజం చేసి వ్యావహారిక భాషను వాడుకలోకి తీసుకురావడానికి కృషి చేసిన గిడుగు వారిని తెలుగుభాష దినోత్సవం సందర్భంగా మరోసారి స్మరించుకోవడం మా తెలుగుశాఖకు ఆనందంగా ఉంది!

2012లో ఇంటర్-నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్ వారిచే తెలుగు భాష
ప్రపంచంలోకెల్లా 2వ 'బెస్ట్ స్క్రిప్ట్'గా ఎన్నికైంది. మొదటి స్థానంలో
కొరియన్ భాష నిలిచింది!

దక్షిణ భారత దేశంలో ఎక్కువ శాతం ప్రజలు మాట్లాడే భాషల్లో
తెలుగు భాష ప్రథమ స్థానంలో ఉంది. దేశంలో 4వ స్థానం కాగా
ప్రపంచంలో 15వ స్థానంలో ఉంది!

**తెలుగు వైభవం!**

తెలుగుజాతి తనలో ఎన్నో జీవన మూల్యాలను, సంస్కృతిని, సంప్రదాయాలను, సామాజిక విలువలను, సంబంధాలను కాపాడుకుంటూ వచ్చింది. వందలలో కాదు.. వేలల్లో కాదు.. లక్షల్లో కాదు.. కోట్లల్లో కూడా వెతికి చూసినా ఇలాంటి అరుదైన భాష మరెక్కడా కనిపించదు! తెలుగు భాష మాధుర్యం తన సాహిత్యాన్ని చూస్తేనే అర్థమవుతుంది. అంతేకాకుండా తెలుగుభాష 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్' అన్న కీర్తిని కూడా సంపాదించుకుంది!

ఈ నేల మీది గొప్ప గొప్ప రాజులు, పండితులు, కవులు, స్వాతంత్ర్య యోధులు మన తెలుగుజాతి కీర్తిని ద్విగుణీకృతం చేశారు. శాతవాహన పరిపాలకుడైన గౌతమీపుత్ర శాతకర్ణి ఎన్నో రాజ్యాలను జయించి తెలుగు రాష్ట్రాన్ని విస్తరించాడు. కాకతీయులు తెలుగు ప్రాంతాన్ని మరింత విస్తరించి, రాజుల దండయాత్రల నుండి రక్షణ కవచాలుగా నిలిచి, ఎన్నో శిల్పకళా నైపుణ్యం కల నిర్మాణాలు గావించి, తెలుగు సంస్కృతికి అండగా నిలిచారు. కాకతీయులలో ప్రఖ్యాతి గాంచిన రాణీ రుద్రమదేవి వీరపౌరుష పరాక్రమాల కీర్తి చరిత విదేశాలలో సైతం నేటికీ మారుమోగుతోంది.

శ్రీ రాజరాజ నరేంద్రుడు గొప్ప పరిపాలకుడు. తెలుగుభాష పురోగతి కోసం తన ఆస్థానకవి అయిన నన్నయభట్టును మహాభారతమును తెలుగులో అనువదించమని చెప్పెను. పోతన మహాకవి భాగవతమును తెలుగులో అద్భుతంగా అనువదించారు. తిక్కన తన కవితలలో తీయందనాలను నిక్షిప్తం చేసిన గొప్ప కవి. వేమన శతకాలు తెలుగు జాతికి వరప్రదాయిని! అలాగే అల్లూరి సీతారామరాజు, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి, కుమురం భీం వంటి యోధులెందరో తెలుగుజాతి స్వాతంత్ర్య సమర వీరులుగా వినుతికెక్కారు.

మన సంస్కృతికి సంబంధించి తెలుగు పాటలు, ఆటలు, పండుగలు, వంటకాలు ఎంతో విశేషం కలవి. మన తెలుగు గొప్పతనాన్ని లఘువుగా తెలపడం సులభం కాదు. ఆ తెలుగుతనాన్ని గ్రహించి గర్వించి తెలుగులో మాట్లాడుతూ తెలుగును పరిరక్షించుకుందాం!

జై తెలుగుతల్లి!!

– మేఘన, బియస్సీ (ఎమ్‌సిజెడ్) సెకండ్ ఇయర్

తెలుగు భాష మాట్లాడినప్పుడు
మన శరీరంలో 72,000 న్యూరాన్లు యాక్టివేట్ అవుతాయి.
ప్రపంచంలో ఉన్న అన్ని భాషల్లోకన్నా ఇదే ఎక్కువ అని సైన్స్ నిర్ధారించింది!

**తెలుగు భాష**

"భాషలందు తెలుగు లెస్స" అని శ్రీకృష్ణ దేవరాయలు మన తెలుగుభాషను కీర్తించారు. తెలుగుభాష ఎంతో ప్రాచీనమైనది. ఇది ద్రావిడ భాషా వర్గమునకు చెందినది. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలలో అధికార భాష. తెలుగుభాషకు సంకేతంగా తెలుగుతల్లి ఒక చేత పూర్ణకుంభం, మరొక చేత వరికంకితో నిండుదనానికి, పంటలకు ఆలవాలము. భాష సంస్కృతిలో ఒక భాగము. కూచిపూడి నృత్యము మన తెలుగు సంప్రదాయాలకు నిలువెత్తు సాక్షము. కర్ణాటక సంగీతంలో తెలుగు ఇట్టే ఇమిడిపోవడంతో సంగీతానికి, సాహిత్యానికి, నృత్యానికి మాతృకగా వ్యవహరించింది. తెలుగుభాష యొక్క సంస్కృతి విశాలమైనది. తెలుగులో నాలుగు ప్రధానమైన మాండలిక భాషలున్నాయి. 1. సాగరాంధ్ర భాష 2. రాయలసీమ భాష 3. తెలంగాణ భాష 4. కళింగాంధ్ర భాష. తెలుగు లిపి ఇతర భారతీయ భాషల లిపులలాగే ప్రాచీన బ్రాహ్మీ లిపి నుండి తీసుకొనబడింది. శాతవాహనులు బ్రాహ్మీ లిపిని దక్షిణ భారత దేశానికి తీసుకొని వచ్చారు. అందువలనే మూలద్రావిడ భాషల నుండి దక్షిణాన అన్ని భాషలు ఉద్భవించాయి. ప్రస్తుతం ఆంధ్ర, తెలంగాణలలో 8.4 కోట్ల మంది తెలుగువారు ఉన్నారు. భారతదేశంలో తెలుగు భాషా వాడకం నాలుగో స్థానంలో నిలిచింది.

– శ్రీజ, బిబిఏ సెకండ్ ఇయర్